# తాను తవ్విన గొయ్యి



గుత్తుల భాస్కరరావు

గతరాత్రి బంగాళాఖాతంలో వాయుగుండమని రేడియో ప్రకటించినపుడు లలిత ముందుచూపుతో శనగలు నానబోసింది. అవే మషాలాశనగలై ఈ పూటకి టిఫిన్‌గా అవతరించినై. ఒక్కొక్కటి తమాషాగా దంతాల మధ్య నలగేస్తున్న సమయంలో యాభై ఏళ్ళ యింటావిడ సీతారత్నం గారు తలుపులు తోసుకొని తెల్లటి బట్టలతో వచ్చింది.

చటుక్కున చాకచక్యంగా బల్ల చాటుకి శనగల ప్లేటు తోసాను. అంగిట్లో మిగిలిన అవశేషాన్ని రహస్యంగా మింగి 'రండి రండి' అన్నాను లేచి నిలబడి. ఆవిడ నవ్వుతూ 'కూర్చోబాబూ' అంటూ కుర్చీ లాక్కుంది.

నేనంటే ఆవిడకి చాలా మంచి అభి ప్రాయం ఉండడం మూలాన యింత వరకూ అద్దెకున్న వాళ్ళలో నాలాంటి వాణ్ణి ఆవిడ చూడకపోవడం వలన... ఆమె మెచ్చుకోలుకు అనుగుణంగా నడుచుకుంటూ వచ్చాను. అందుకే నిలబడి ఉంటూనే 'ఫరవాలేదు చెప్పండి' అన్నాను. 'కూర్చో నాయనా ... ఒక విషయం మాట్లాడాలి' అని ఆవిడ గద్దించడంతో ఎదురుగా కుర్చీలో ఒదిగి కూర్చున్నాను.

"చూడుబాబూ మూర్తీ! మనకు డబ్బు ప్రధానం కాదు. లంకంత కొంపలో ఉండలేక ... మధ్యలో మేం ఉంటూ రెండు వాటాలు అద్దెకిచ్చాం...అయినా ...యిలా యిల్లు వాడుకోడం తెలియని ఏబ్రాసులకి యివ్వాల్సి వస్తుందనుకోలేదు" అంది సీతారత్నంగారు.

విషయం ఏ వాటావాళ్ళమీదో అర్థంకాక లలిత సాయంకోసం వంటింట్లోకి చూసాను. ఏ మూలో కుంపటి కౌగిట్లో ఉన్నట్టుంది. కంటికి కనిపించ లేదు. ఆవిడ నవ్వి "అబ్బ! మీవిషయం కాదు బాబూ. మీకేం మల్లెపువ్వుల్లా చూడముచ్చటైన దంపతులు. ఆ గోపాలం విషయం నేచెప్పవచ్చేది. మా కొంప పీకి పందిరెయ్యడానికా కాక పోతే... ఆ పిల్లలు వాళ్ళని ఉద్ధరించడానికా? పందెంపుంజులా మాతో పూటపూటకీ గిల్లికజ్జాలు పెట్టుకోకపోతే ఆవిడ ఉంది కాపరం చెయ్యడానికా? రామ రామ వేగలేకపోతున్నాం ఆ మూకతో. యిల్లేనాడైన కడిగిన పాపాన పోయిందా? కళ్ళారా చూద్దామంటే ఒక్క రోజైనా వాకిట్లో కళ్ళాపిజల్లి ముగ్గు పెట్టిందా? బండెడు అంట్లు తోముతుందే ఒక్కనాడైనా నూతిపళ్ళెం కడిగిందా? బాబూ అవన్నీ ఎందుకు. యిలాంటి మందని యింట్లోంచి వెళ్ళగొట్టడమే నా ఉద్దేశ్యం అందుకని అద్దె యాభైనుండి అరవైకి పెంచుతున్నట్టు నాటకమాడుతున్నాను. వాళ్ళెలాగూ అరవై యిచ్చుకోలేరు. యిల్లు ఖాళీ చెయ్యడం ఖాయం. యిందుకు నీ మాట సాయంకావాలి బాబూ" అంది గుక్కతిప్పుకోకుండా.

"మాట సాయమా" అన్నాను ఉత్సాహంగా... నాకు గోపాలం మీదఉన్న పాతకోపం పురస్కరించుకొని. చేప పిల్లలా ఎగిరిన నా ఉత్సాహాన్ని అంది పుచ్చుకొని "అవును బాబూ నువ్వూ అద్దె అరవై యిచ్చినట్టు గోపాలంతో అబద్ధమాడాలి. అదీ అవసరమైతేనే... సాధ్యమైనంత వరకూ నేనే వెళ్ళగొడతాను" అంది. ఎప్పట్నుంచో గోపాలానికి దూరంగా ఉండాలన్న నా కోరిక యిలా నెరవేర బోతుందని ఊహించలేదు.

"సరే" అన్నాను పూతంగా. ఆవిడ హాయిగా విశ్వసించి పరమానందంగా వెళ్ళిపోయింది.

లలిత ముందు గదిలోకి దూకుడుగా

వచ్చి "అంతా విన్నాను. అయితే ఆవిడ చెప్పినట్లు చేస్తారన్న మాట" అంది కోపంగా అవునన్నట్లు చూసి దాచుకొన్న శనగల ప్లేటు ముందుకి లాక్కుని "ఏం" అన్నాను.

"యివాళ వాళ్ళని లేవగొడుతుంది. రేపు మనల్ని. గుర్తుంచుకోండి" అని గొణుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

అదేమీ కాదు. గోపాలం అంటే నాకెంత అసహ్యమో లలితకు అంత అభిమానం. అతనూ నేనూ ఒకే ఆఫీసులో క్లర్కులం. అతన్ని లలిత బ్రతుకనేర్చినవాడని మెచ్చుకుంటుంది. నన్ను చేతగాని వాడికింద జమకడుతుంది. ''ఆఫీసులో బల్లకిందకొద్దో గొప్పో పండిస్తున్నాడు గాబట్టి సరిపోయింది. మనలాంటి 'గోచీకి ఎక్కువ గావంచాకి తక్కువ' జీతగాళ్ళకి జీతాలేమూల" అంటుంది

'మీవారు మట్టికొట్టుగాని ఆసీట్లో బంగారం దొరుకుతుందట' అని గోపాలం భార్యద్వారా విన్న లలిత పోరు పరింత లైంది.

'ఏమిటీ పాడు రిపోర్టు. అటు మేతా లేదు. యిటు రాతారేదు' అని నావల్ల పని జరగని మంటతో ఆఫీసరిచ్చిన డోసు ఆమెవల్లే లలిత చెవులోకి పాకింది. ఇదంతా గోపాలం ప్రతిభ.

ఒక పూట ఉండలేక "అయితే అతనిలా గడ్డి తినమంటావా" అని నిలేసాను లలితని.

"మనకూ నలుగురు పైలుదేరిం తర్వాత తెలుస్తుంది. అది గడ్డో గాదమో." యిల్లాలి ఎదురు పోటు.

"గోపాలం దరిద్రం కొన్ని జన్మలెత్తినా తీరదు లంచాలు పుచ్చుకుంటున్నా నెలకి వందపైన అప్పులు చేస్తాడు. యిదిలా ఉంటే ఓ శుభ ముహూర్తాన పెళ్ళాంబిడ్డల్ని నట్టేట్లో ముంచి జైలుకిపోతాడు" బెదిరించాను.

"జైలు పడేది తెలివి తక్కువ వాళ్ళకి. పార్టీలని పీడించుకు తినక్కర్లేదు. యిచ్చిన వాళ్ళ దగ్గర పుచ్చుకుంటే ఇంటద్దె పోతుంది. బాబూ మీరు నిజాయితీగా బ్రతుకుతానంటే కాదనను. నా ఖర్మ అనుకుంటాను," అంది ఆ రోజుకి ముగిస్తూ.

ఈ గోపాలం వల్ల యింట్లో సుఖశాంతులు లేకపోయాయి. పట్టుమని పాతికేళ్ళు నిండని ఈ ఆడకూతుర్ని ఎక్కడలేని దురాశ ఊపిరాడకుండా చేస్తుంది. నా జీతం మా యిద్దరికీ సరిపోని మాట వాస్తవమే. ఆదాయంలో అయిదో వంతు అద్దెకింద హరీ అనడం నిజం. ఈ పట్టణంలో నాలాంటి లోయర్ మిడిల్ క్లాస్ మనిషి బ్రతకడానికి యాభై కి తక్కువ వాటా యించుమించు లేదు. తప్పని సరిగా పెద్ద మొత్తమైన యాభైని అద్దెకి జమకట్టడం తద్వారా

ఎన్నో సరదాల్ని చంపుకొని కుదింపు బ్రతుక్కి అలవాటుపడ్డం లలిత కి విసుగ్గానే ఉంది. సీతారత్నంగారి పుణ్యమా అంటూ గోపాలం యిల్లు ఖాళీ చేస్తాడు. ఆపైన ఈ సమస్య లలితని అంతగా బాధించదని నా నమ్మకం.

ఫస్టు తారీఖు సాయంత్రం ఆఫీసు నుండి యింటికి జేరుకొని అలసటగా పడక్కుర్చీతో నడుంవాల్చాను. బయ టేదో రగడ జరుగుతూంది. సీతారత్నం గారితో గోపాలం వాగ్వివాదం కర్ణా కర్ణిగా వినబడుతుంటే లేచి గుమ్మం వరకూ వెళ్ళి మూసిన తలుపులకాని చెవులు రిక్కించాను.

ఆవిడ కంఠం పెద్ద స్థాయిలో ఖంగునవినిపిస్తూంది. "న్యాయం లేదు అన్యాయం లేదు. అరవై రూపాయలు యిచ్చుకో లేకపోతే యిల్లు ఖాళీ చెయ్యా ల్సిందే."

గోపాలం "ఎంత తేలిగ్గా అన్నారు యిల్లు ఖాళీచెయ్యమని. మీ రే సదుపా యాలు చేసారని అర్థాంతరంగా అద్దె పెంచారు ?" అన్నాడు.

"అదంతా అనవసరం. మీరున్నా సరే ఖాళీచేసినాసరే అరవై కి అరపైసా తగ్గను."

"సరే యాభై కిమించి ఒక్క చిల్లి గవ్వ యివ్వను. యిది కాకపోతే దీని బాబులాంటి పోర్షన్ చూస్తా. తక్షణం ఖాళీచేస్తాను" అని గోపాలం చివాల్న యింట్లోకి వెళ్ళాడు ... తలుపుసందు లోంచిచూస్తూ మా బాగా జరిగింది అను కున్నాను. సీతారత్నంగారు ఊరుకో కుండా మరోపుల్ల వెలిగించింది.

"మీ వాటాకో రూలు ఆ వాటాకో రూలూనా? మాకు అందరూ సమానమే.''

గోపాలం సర్రున బైటకి వచ్చాడు. "అంటే మూర్తి అరవై యివ్వడానికి ఒప్పుకున్నాడా ?" అన్నాడు ఉద్వే గంతో. నా గుండె కొట్టుకుంటూంది. యిప్పుడు నా పాత్రకి పని కలుగ బోతూంది.

"ఒప్పుకున్నాడా ఏమిటి ? చెక్క పేళ్ళలా అరవై రూపాయలిస్తే." బలే కోసింది నేనింకా అద్దె యివ్వనే లేదు.

"మూర్తి అంతపని జేసాడన్నమాట" గోపాలం ఆశ్చర్యం. మళ్ళీ "ఏదీ పిల వండి-నేనడుగుతాను'' అన్నాడు.

''నే న బద్ధం చెప్పా నా ? ... మూర్తీ ... " అని కేకేసింది అధికార యుక్తంగా.

రోషపడి మడుగునుండి బైటపడ్డ దుర్యోధనుడిలా వెలుపలికి వచ్చాను.

"అవునయ్యా యిచ్చాను" అన్నాను దీమాగా.

''ఛీ, ఎంత తెలివి తక్కువ వాడి వయ్యా నువ్వు - వాళ్ళు ఎంత పెంచితే అంత యిచ్చెయ్యడమా. ఒక ఆఫీసులో



యువ

పనిచేస్తున్నాం. నాతో మాటవరసకైనా సంప్రదించావా ?" అన్నాడు బిగ్గరగా.

సీతారత్నంగారు గుమ్మానికి తీవిగా జేరగిలబడి నిల్చుంది, నా ధోరణిమీద కొండంత ఆశను పెట్టుకొని.

"ఏమని సంప్రదించాలి బోడి పది రూపాయలకి. అంత విలువచేస్తుంది గాబట్టి చెల్లించాను. మనమూ వాళ్ళ యిబ్బందులు తెలుసుకోవాలి" అంటూ శక్తివంచనలేకుండా వాదించాను. "అది నీకు బోడి పదిరూపాయలు - నాలాంటి వాడికి అదే పదివేలు. దీనివల్ల నేను చెడి పోయింది లేదు. యిల్లు ఖాళీచేస్తాను. అంతే. నువ్వుమాత్రం వాస్తవాన్ని తెలుసుకొని ఒళ్ళు సిలదొక్కుకో" అని హెచ్చరించి యింట్లోకిదూసుకుపోయాడు గోపాలం.

నేనూ సీతారత్నంగారు పాచిక పారిందన్న సంతోషంలో నవ్వు చూపులతో ఛీర్స్ కొట్టుకుంటూ నిష్క్రమించాం.

మర్నాడుదయం పేపరు తిరగేస్తుంటే సీతారత్నంగారు వచ్చి "చాలా సంతోషం బాబూ. నీ మాట సాయం పనిచేసింది" అంది కూర్చుంటూ.

నేను విజయగర్వంతో "యివాళ ఖాళీచేస్తున్నాడా యిల్లు" అన్నాను.

"లేదుబాబూ, ఏం ఆలోచించుకొన్నాడో ఏమో 'ఆ మూర్తికంటే తీసిపోయానా' అంటూ 'అరవై యిస్తాన'ని ఒప్పుకొన్నాడు. మన డబ్బులు మన కొస్తున్నప్పుడు... ఎవరైతేనేం నాయనా ఏమంటావు."

నాకు కళ్ళమీద మబ్బుల గుంపు చుటుముట్టినట్టయింది. కాళ్ళకింద గచ్చు విచ్చుకుంటున్నట్టయింది. గోపాలం వెళ్ళకపోవడం దేవుడెరుగు ... అద్దె అరవైలో ఫిక్స్ అయినందుకు యిరుకులో పడ్డాను.

"అన్నట్టు చూడు బాబూ. నీకు చెప్పనక్ఖర్లేదు. మన వాటా అద్దెకూడా అరవై రూపాయలే. లలితకి చెప్పు. ఈనెల పెంకుతిరగే యిస్తున్నా. స్నానాలగది తలుపుబాగుచేయిస్తా...యింక..."

ఆవిడ అలా ఎంతసేపు మాట్లాడిందో... ఎప్పుడు వెళ్ళిపోయిందో నాకు గుర్తులేదు.

ఆ రోజు కారోజు కిక్కురుమనకుండా యిల్లు ఖాళీచేసాను అరవై రూపాయలిచ్చుకోలేని అభాగ్యుణ్నయిన నేను.

